క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్న కారణంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్, హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వరంగల్‌లోని శంభునిపేట, బొల్లికుంట సబ్‌స్టేషన్ల పరిధిలోని శంభునిపేట, రంగశాయిపేట, గణేష్‌నగర్, గిరిప్రసాద్ కాలనీ, విశ్వనాథ కాలనీ, ఏఎస్ఎంకాలనీ, వాల్‌మార్ట్, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్, తెలంగాణ కాలనీ, కుమ్మరివాడ, గొల్లవాడ, దూపకుంట, వసంతపూర్, బొల్లికుంట, వాగ్దేవి కళాశాల, రామకృష్ణాపూర్, ముల్కలపల్లి ప్రాంతాల్లో ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. హనుమకొండలోని యాదవనగర్, సోమిడి, టేకులగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో వివరించారు.

ఆర్థిక సాయం అందజేత



వరంగల్: ఇటీవల వర్ధన్నపేట మండలం ఇల్లంద వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ భట్టు శ్రీనివాస్ కుటుంబానికి రూ.11 వేల ఆర్థిక సాయాన్ని సద్గురు శివానందమూర్తి ట్రస్ట్ నుంచి శుక్రవారం అందించినట్లు మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్, ట్రస్టీ బండారు సాయినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవగా సద్గురు శివానందమూర్తి ట్రస్ట్ నుంచి చేయూతనందించినట్లు వివరించారు.

ప్రతిఘటన ఉద్యమ నేత ఆశయ సాధనకు పోరాటం

వరంగల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా గుండాల మండలం రోళ్లగడ్డ అటవీ ప్రాంతంలో 21ఏళ్ల క్రితం అప్పటి చంద్రబాబు ప్రభుత్వ రాజ్యహింసలో భాగంగా జరిపిన కాల్పుల్లో మరణించిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ప్రతిఘటన నేత మురళి ఆశయ సాధనకు పోరాడాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్‌లోని ఇఫ్టూ కార్యాలయంలో మురళి వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఆరెల్లి కృష్ణ, ఎలకంటి రాజేందర్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సుమన్, రంజిత్, రవి పాల్గొన్నారు.

వర్ధన్నపేట నుంచి అవకాశం కల్పించాలి



హన్మకొండ: వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం కల్పించాలని ఆ పార్టీ ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జన్ను మధుకర్ కోరారు. హైదరాబాద్‌లో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషాను శుక్రవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. 25ఏళ్లుగా పార్టీ పటిష్టత కోసం పని చేస్తున్నానని పేర్కొన్నారు.

మహనీయులకు నివాళి

హన్మకొండ: బహుజన పోరాటయోధుడు సర్వాయి పాపన్న జయంతి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హిందూ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని హనుమకొండ హనుమాన్‌నగర్ -1లో శుక్రవారం జరుపుకున్నారు. మహనీయుల చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి, కాలనీవాసులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మనోహర్, శ్రీనివాస్, కుమార్‌రెడ్డి, మాదారపు ఉదయ్‌కిరణ్, వెంకటేష్, చిర్ర శ్రవణ్‌గౌడ్, రమేష్ గౌడ్, రాజు గౌడ్, సదానందం గౌడ్, సాయి పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు..

ఖిలా వరంగల్: ప్రజా కళాకారుడు గద్దర్ అభిమానుల ఆధ్వర్యంలో పడమరకోటలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో మైదం రవి అధ్యక్షతన ప్రజా సంఘాల నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గద్దర్ సంస్మరణ సభను పడమరకోట జంక్షన్‌లో నిర్వహించాలని, బహిరంగ సభకు మేధావులు, కవులు, కళాకారులను ఆహ్వానించాలని తీర్మానం చేశారు. భిక్షపతి, అంజయ్య, పాణి, అశోక్, సురేందర్, బాబు, అశోకుడు, వీరేశం, బాబు, మహేందర్, నాగరాజు పాల్గొన్నారు.

టీటీడీ నీతి కథల పోటీలు

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కథ చెపుతారా.. ఊ కొడుతాం.. నీతికథల పోటీల్లో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. పిన్నావారి వీధిలోని శారద ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు వరంగల్ ఆర్య సమాజం ముఖ్య కార్యకర్త రాజేందర్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. టీటీడీ డీపీపీ ప్రోగ్రాం ఆఫీసర్ రామిరెడ్డి కృష్ణమూర్తి పర్యవేక్షించారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి

గతంలోనే తెలంగాణలో బహుజన రాజ్యాధికారానికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి, బహుజన ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని పలువురు కొనియాడారు. పాపన్న జయంతిని పురస్కరించుకొని నగర వ్యాప్తంగా శుక్రవారం వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన ధీరత్వం, ధైర్య సాహసాలను గుర్తుచేసుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



కాశిబుగ్గ జంక్షన్‌లో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



హన్మకొండ: సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు



హసన్‌పర్తి: పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



మడికొండలో గీత కార్మికుడు రాజ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు



వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు పంపిణీ చేస్తున్న దిడ్డి నాగరాజు

ఆలయాల్లో శ్రావణ మాస ప్రత్యేక పూజలు



మెట్టుగుట్టపై అభిషేకం చేస్తున్న భక్తులు



హసన్‌పర్తి: పూజలో పాల్గొన్న మహిళలు

మడికొండ: శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివాలయం, రామాలయాల్లో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనచార్యుల మంత్రోచ్చరణల మధ్య ఉదయం ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో కార్యనిర్వాహణాధికారి కే.శేషుభారతి, చైర్మన్ దువ్వ నవీన్, ధర్మకర్తలు చింతకుంట్ల భూపాల్‌రెడ్డి, ఓర్సు రాజు, పెద్ది ప్రభాకర్, కుమారస్వామి, సంధ్య, అర్చకులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో శ్రావణ మాస శోభ

హసన్‌పర్తి: శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఆలయాలతో పాటు ఇళ్లల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

వరంగల్ చౌరస్తా: వరంగల్ బట్టల బజారులోని బాలానగర వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ ఈఓ ఎలపాటి రత్నాకర్ రెడ్డి, వంశ పారంపర్య చైర్మన్ పరాశరం శ్రీనివాస చారి వెల్లడించారు. కార్యక్రమంలో గుముడవెల్లి అశోక్, కొండూరు జ్ఞానేశ్వర్, గాదె వాసుదేవ్, యాదా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలోని దక్షిణముఖ అభయాంజనేయ స్వామిని లక్ష మల్లెలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అందించిన లక్ష మల్లెలతో దండలు అల్లి స్వామి వారికి వేశారు.

ఇకపై వేగంగా మెరుగైన వైద్యసేవలు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలో 108, 102వాహనాల ద్వారా అందించే అత్యవసర వైద్య సేవలు ఇకపై మరింత వేగంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. జిల్లాకు నూతనంగా వచ్చిన 108, 102వాహనాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్, కుడా చైర్మన్ సుందర్ రాజ్, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, 108వాహన సర్వీసుల జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్, ప్రతినిధులు చంద్రశేఖర్, అఫ్రోజ్, మహేష్, పైలట్ లకావత్ బాలాజీనాయక్, ఈఎంటీలు చైతన్య, సురేందర్, అశోక్‌రెడ్డి, దేవేందర్‌రావు, కుమారస్వామి తదితరులు ఉన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న చీఫ్ విప్

కాజీపేట రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు కాజీపేటలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే, రహమత్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు పాము రాజేష్‌ను పరామర్శించారు.

హన్మకొండ: 59వ డివిజన్ హనుమకొండ సుబేదారిలోని అలీపూర్‌లో మైనారిటీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సుహాస్, నయీం, అరిఫ్, మజీత్, జిలానీ, రఫీక్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో కార్యకర్తలే కీలకం



కాజీపేట: పలు ప్రాంతాల నుంచి గణపతి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కార్యకర్తలు 16రోజుల పాటు శ్రమించి పనిచేయాలని శ్వేతార్క ఆలయ వ్యవస్థాపకులు ఐనవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి పిలుపునిచ్చారు. కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయం సమావేశ మందిరంలో శుక్రవారం కార్యకర్తల సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు పండితులు, వీఐపీలు, కళాకారులు అధిక సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో సరైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షను విజయవంతం చేయాలి

హసన్‌పర్తి: రెడ్డి ఐక్య సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం నిర్వహించ తలపెట్టిన రెడ్డి నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం హసన్‌పర్తి మండల అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

రెగ్యులరైజ్ చేయాలని నిరవధిక సమ్మె

హన్మకొండ: రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పనాస ప్రసాద్ డిమాండ్ చేశారు. తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఏఎన్ఎంలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేస్తూ సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, దామెర కృష్ణ, గోవర్ధన చారి, యాకూబ్, జాన్‌పాల్, సెకండ్ ఏఎన్ఎంల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, రజిత, ఉపాధ్యక్షురాలు సాలమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పనాస ప్రసాద్

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం ఉమ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శంకర్‌రావు, ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో అర్హులైనవారు ప్రవేశాలు పొందాలని హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ హైస్కూల్ హెచ్‌ఎం ఉమ కోరారు. ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావుతో కలిసి ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువును మధ్యలో మానేసిన వారు ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొంది ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. అపరాధ రుసుంతో ఈనెల 31వరకు గడువు ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వలపైడి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, స్వామి, సారంగపాణి, అవినాష్, రమేష్ పాల్గొన్నారు.

ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కేయూ క్యాంపస్: ఓ మహిళా లెక్చరర్‌ను లైంగికంగా వేధించిన హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని తెలుగు విభాగానికి చెందిన ఓ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు మిశ్రీన్‌సుల్తానా, కార్యదర్శి మంద శ్రీకాంత్ కోరారు. ఈమేరకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనను లైంగికంగా వేధిస్తున్నాడని ఆర్ట్స్ కళాశాలకు చెందిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కాకతీయ యూనివర్సిటీ అధికారులకు సదరు మహిళా లెక్చరర్ ఇప్పటికే ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ ఉన్నారు.

'అన్‌మ్యాన్డ్ వర్కర్ల'ను ఆర్టిజన్లుగా గుర్తించాలి

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తిస్తూ సంస్థల్లో విలీనం చేసుకోవాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్పీడీసీఎల్ శాఖ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు గాదె ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల సమావేశం శుక్రవారం జరిగింది. ఈమేరకు టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17జిల్లాల నుంచి అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో 1600మంది అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు పని చేస్తున్నారని చెప్పారు. వారి సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 24న టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

ఫిర్యాదులకు వెంటనే స్పందించాలి

వరంగల్: ప్రజలు, బాధితుల నుంచి వచ్చి ఫిర్యాదులకు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. ఏనుమాముల పోలీసు స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి స్టేషన్‌లోని రికార్డులు, ఫైళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్కువగా భూ ఆక్రమణల ఫిర్యాదులు వస్తున్నందున హక్కుదారులకు న్యాయం చేసేందుకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఎస్సై పోగుల శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పిల్లల అక్రమ రవాణాను అరికట్టాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఖిలా వరంగల్: మానవులు, పిల్లల అక్రమ రవాణాను అరికట్టాలని వరంగల్ శిశు సంక్షేమ కమిటీ మాజీ అధ్యక్షుడు మండల పరశురాములు కోరారు. ఈమేరకు వరంగల్ రంగశాయిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యుదయ సేవా సమితి, ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ ఐజేఎం సంయుక్త ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ నరేందర్ అధ్యక్షతన మానవులు, పిల్లల అక్రమ రవాణా నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా వరంగల్ శిశు సంక్షేమ కమిటీ మాజీ అధ్యక్షుడు మండల పరశురాములు హాజరై కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాలను పోలీసులు రక్షణ నీడలో ఉంచాలని ఆయన కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు రంగాచారి, సీహెచ్.కిరణ్‌కుమార్, దేవేందర్ రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ 58వ డివిజన్ రాఘవేంద్రనగర్ ఫేజ్ -1లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను విజయ్‌భాస్కర్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వినయ్‌భాస్కర్‌ను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇమ్మడి లోహిత, నాయకులు ఇమ్మడి రాజు, కండేరావు నర్సింహారావు, నాయకులు జన్ను విజయలక్ష్మి, ఆకుల మధుకర్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న విజయ్‌భాస్కర్

సంక్షిప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని జిల్లా పరిషత్, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయుల నుంచి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 25వ తేదీ వరకు హనుమకొండ జిల్లా డీఈఓ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు.

బందోబస్తు మధ్య పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో గతంలో ఎన్నడు లేనివిధంగా ఈసారి పీహెచ్‌డీ రెండో కేటగిరీలో ప్రవేశాలకు పోలీస్ బందోబస్తు మధ్య రెండో రోజు శుక్రవారం ఇంటర్వ్యూలు కొనసాగాయి. శనివారం సోషియాలజీ, సోషల్‌వర్క్, ఈఐఈ, ఈసీఈ, సీఈ విభాగాల్లో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు జరగనున్నాయి.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

కేయూ క్యాంపస్: రక్తదానం చేయడమంటే ఇతరులకు ప్రాణదానం చేసినట్లే అని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా డీఐఈఓ గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గద్దర్, జహీరుద్దీన్ సంస్మరణ సభ

హన్మకొండ: ప్రజా గాయకుడు గద్దర్, లౌకిక ప్రజాస్వామ్యవాది జహీరుద్దీన్ అలీఖాన్ సంస్మరణ సభను ఈనెల 19న నిర్వహించనున్నట్లు కవులు, కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ నల్లెల రాజయ్య తెలిపారు. ఈమేరకు హనుమకొండ అంబేడ్కర్ కూడలిలోని బుద్ధ ప్లాజా వద్ద సంస్మరణ సభ పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. బ్రహ్మచారి, శంకర్ రావు, గోనెల దేవేందర్, కృష్ణమూర్తి, కొండ్రెడ్డి మల్లారెడ్డి, ప్రకాశ్, జయంత్, రమేష్ పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తా: ప్రజా యుద్ధనౌక గద్దర్, సియాసత్ పత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్‌ల యాది సభను సీపీఐ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు పలు సంఘాల నేతలు తెలిపారు. ఈమేరకు వరంగల్ బల్దియా ఆవరణలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద యాది సభల వాల్‌పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను భాస్కర్, సామాజిక కార్యకర్త కేడల ప్రసాద్, గాయకుడు లింగాల ఇమ్మానుయేల్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

20న పోచమ్మ బోనాల జాతర ప్రారంభం

వరంగల్: శ్రావణమాసం సందర్భంగా వరంగల్ కాశిబుగ్గలోని పోచమ్మతల్లి ఆలయంలో ఈనెల 20వ తేదీన కుమ్మరి తొలి బోనంతో జాతర ప్రారంభం అవుతుందని ఆలయ ప్రధాన పూజారి ఓరుగంటి రాజేందర్ తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఈమేరకు నిర్ణయించారు. గౌరవ అధ్యక్షుడు ఓని భాస్కర్, వేణుగోపాల్, కుమార్, శ్రీనివాస్, కుమారస్వామి, నీలం శ్రీనివాస్, నరేందర్, సుధాకర్, గంగాధర్, హరికుమార్, మధు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలి

హసన్‌పర్తి: అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూంలు మంజూరు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈమేరకు బీజేపీ ఆధ్వర్యంలో హసన్‌పర్తి తహసీల్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రహీంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ సురేష్‌కు ముస్లింల సన్మానం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌ను వరంగల్ ఫోర్ట్ రోడ్డు, శంభునిపేట ప్రాంతాల ఈద్గా, దర్గా, ఖబరస్తాన్, మసీదుల పరిరక్షణ కమిటీ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించారు. మీర్జా నసీరుల్లా బేగ్, ఈద్గా కేర్‌టేకర్ ఎంఏ.ఖాలిక్ తన్వీర్, సయ్యద్ రబ్బాని, ఎండీ.హిస్సామొద్దీన్ మాషూక్, ఎండీ.షౌకత్ అలీ, షఫియొద్దీన్, నూరొద్దీన్, అఖిల్, ఎండీ.గౌస్, జాకీర్, ఖహీం, మోసిన్, ముషైద్ తైసీర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ -5 కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం శుక్రవారం జరిగింది. ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పున్నంచందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ అనితారాణి తన సొంత ఖర్చుతో పిల్లలకు పలకలు అందించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సిద్ధం రాజు శుక్రవారం ప్రారంభించారు. అచ్చ వినోద్‌కుమార్, తడక రవి, బోరిగం నర్సింగం, ఐలు, రాజు, రాంబాబు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

వరంగల్ చౌరస్తా: వరంగల్ గోవిందరాజుల గుట్ట ఆలయ రథం ప్రాంగణంలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్, జ్యోతి దంపతులు శుక్రవారం భూమి పూజ చేశారు. పూజారులు శ్రీనివాసా చార్యులు, స్థానికులు రాజేందర్, అంబటి రాజేందర్, కొమ్ము రాజ్‌కుమార్, పర్వ శ్రీనివాస్, గోవిందు, భిక్షపతి పాల్గొన్నారు.

ఉత్సవాలకు సోమేశ్వర ఆలయం ముస్తాబు

కాజీపేట: 62వ డివిజన్ సోమిడిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు నవగ్రహ మూర్తుల పునః ప్రతిష్ఠాపనోత్సవాలు జరగనున్నాయి. దాంతో ఆలయ పరిసరాలను అందంగా ముస్తాబు చేశారు.

నియామకం

మడికొండ: మన తెలంగాణ రాష్ట్ర సమాఖ్య పార్టీ ధర్మసాగర్ మండల ఇన్‌చార్జ్‌గా రాంపూర్ గ్రామానికి చెందిన కందుకూరి రమేష్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగ వేణుగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన అన్నాసాగరం గ్రామానికి చెందిన రామంచ వజ్రమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అరూరి రమేష్ శుక్రవారం పరామర్శించారు. అలాగే, భీమారానికి చెందిన బూర సుదర్శన్, శేఖరయ్య కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

కాజీపేట: కాజీపేట డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురికి రెండు రోజుల పాటు జైలుశిక్ష, నలుగురికి రూ.6,700 జరిమానా విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కే.విద్యాసాగర్ రావు తీర్పునిచ్చారు.

పేకాట శిబిరంపై దాడి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం మడిపల్లిలోని ఓ రహస్య ప్రదేశంలో పేకాట శిబిరంపై పోలీసులు గురువారం అర్ధరాత్రి దాడి చేసి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయగా మరొకరు పరారయ్యారు. వారి నుంచి రూ.7640 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

ఆటో బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

ఖిలా వరంగల్: చింతల్ ఫ్లెక్షవర్ బ్రిడ్జి సమీపంలో అతివేగంగా వెళ్తూ ఆటో అదుపు తప్పి బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కోమలోకి వెళ్లిన క్షతగాత్రుడి ఇన్‌స్పెక్టర్ సురేష్.. ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఏఎన్ఎంల మానవహారం

ఎంజీఎం: తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టు ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. ఈమేరకు చేపట్టిన సమ్మె శుక్రవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఈక్రమంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి ఎంజీఎం జంక్షన్‌కు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏఎన్ఎంల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.



మానవహారం చేపట్టిన ఏఎన్ఎంలు